కథ

# దూరపు కొడుకు

- భమిడి వెంకటేశ్వర్లు

**రామకోటయ్య** మాస్టారు నుంచి ఉత్తరం వచ్చింది. ఈ మూడు నెలల కాలంలో యీ వుత్తరం నాలుగోది. చక్రవర్తికి ఆశ్చర్యంగా ఉంది. "మాస్టారు ....... ఇలా తరచు ఉత్తరం రాయడం ఏవిటి ?" అని. అలా అనుకుంటూనే చదవసాగాడు ......... ఉభయకుశలోపరి ..... క్షేమసమాచారాల తరువాత వున్న వాక్యాలు యిలా ఉన్నాయి. "ఇంతకుముందు రాసిన వుత్తరాలు నీకు అందాయో లేవో తెలియదు. ఇది అందగానే తప్పక వస్తావని అనుకుంటున్నాను" అని.

ఆలోచనలో పడ్డాడు చక్రవర్తి.

రామకోటయ్య దగ్గర చదువుకున్నాడు అతను. తనంటే ప్రత్యేక అభిమానం ఉండేది. ఆయన దగ్గర మూడేళ్ళు చదువుకుంటూనే మరింత దగ్గరయ్యాడు. ఎక్కడో దూరపు చుట్టరికం మాత్రమే వారిని ఆత్మీయులను చేయలేదు.

ఆ వూరికీ, అక్కడి హైస్కూలుకీ, రామకోటయ్యకు విడదీయరాని అనుబంధమే వుంది.

చక్రవర్తిని టీచరు ఉద్యోగంలోకి రావద్దన్నాడు ఆయన. తను బి.యస్సీ. అయ్యాక బి.ఇడి. చదవాలనుకుంటున్నానని చెప్పినప్పుడు "ఎందుకు" అని అడిగాడు తను.

"మా రోజులు కావివి. కాలం మారిపోయింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రస్తుతం చదువు పట్ల శ్రద్ధ, ఆసక్తి అంతగా కనబరచట్లేదు. హాయిగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరితే జీతంతో పాటు మనశ్శాంతి లభిస్తాయి. ఆపైన సెలవులు...... ఇతర సౌకర్యాలు .........."

రామకోటయ్య పాతికేళ్ళ క్రితం రిటైరయ్యాడు. వారం రోజుల తర్వాత అప్పుడు కలిసాడు.

"మాస్టారూ ......... మీ భవిష్యత్ ప్రణాళిక ఏవిటి" అని అడిగాడు చక్రవర్తి.

అందుకాయన పేలవంగా నవ్వుతూ చెప్పాడు. "నలుగురు కొడుకులున్నారు. ముగ్గురు కూతుళ్ళు. అందరికీ వివాహాలు చేసాను. కొడుకుల దగ్గర వుండే అదృష్టం మాకు వుందో లేదో నీకు తెలియనిది కాదు. ఇంక, అమ్మాయిల దగ్గరకు ఎలా వెళ్ళగలం! అందుకని మా వూళ్ళోనే వుంటాం. కొడుకులు పిలిస్తే అప్పుడు ఆలోచిస్తాం" అని.

"ఎటూ రిటైరయ్యారు కాబట్టి నా దగ్గరకు మీరు ఎప్పుడైనా రావచ్చు. నన్ను మర్చిపోకండి" అన్నాడు అతను.

రామకోటయ్య కళ్ళు చెమర్చాయి. "చాలా సంతోషం. నా కొడుకులు ఎవరూ కూడా మమ్మల్ని రమ్మని చెప్పలేదు. రిటైరయ్యాక ఆ వూసే ఎత్తలేదు. నేను మీ వూరు వచ్చినా ఆ విషయం మా భూషణంకి తెలుస్తుంది. వాడు అప్పుడు తప్పకుండా నామీద తిరగబడతాడు" అన్నాడు ఆయన.

భూషణం ఆయన రెండో కొడుకు.

అయితే నెల తర్వాత ఆయన చక్రవర్తి ఇంటికి వెళ్ళి పదిరోజులున్నారు భార్యతో. చక్రవర్తి ఆతిథ్యం ఆనందాన్ని పంచింది. తరువాత నెలలో భూషణం, చక్రవర్తి యింటికొచ్చి ఘర్షణకు దిగాడు. "మా నాన్నకు నువ్వంటే బాగా యిష్టం. అందుకే నీ యింటికొచ్చాడు" అని.

"అది మీ తండ్రీ కొడుకుల విషయం. ఆయన ఎక్కడికెళ్ళాలంటే అక్కడికి వెళ్ళి వుంటారు. అంతగా మీ వాళ్ళని తీసుకెళ్ళదలచుకుంటే అమ్మ, నాన్న ఉన్నప్పుడు వచ్చి తీసుకెళ్ళవలసింది. ఇప్పుడు నామీద దాడికి రావడం 'రాజకీయం' అనిపించుకుంటుంది" అంటూ తిప్పికొట్టాడు చక్రవర్తి.

ఇంకాసేపు ఘర్షణకు దిగి వెళ్ళిపోయాడు భూషణం.

ఈ పాతికేళ్ళలో చక్రవర్తి ఆరేడుసార్లు రామకోటయ్యను కలిసాడు. ఆయన మాత్రం ఏ కొడుకు దగ్గరా వుండలేదు. తమ అదృష్టం అంతేనని భావించాడు ఆయన. అయితే చక్రవర్తి మాత్రం వారితో ఉత్తరాలతో పలకరిస్తూనే వున్నాడు.

"చక్రవర్తి కొడుకు కాకపోయినా అభిమానాన్ని, ప్రేమను పంచుతాడు. అతను మనకు పెద్దకొడుకు కాబోలు" అన్నాడు ఆయన చాలాసార్లు భార్యతో.

కళ్ళ చెమరింపుకు వేడితోపాటు తెరచాటు బంధం కూడా వుంటుందేమో ననిపించింది.

చక్రవర్తి ఆలోచనలు ఉత్తరం మీదకు మళ్ళాయి. "ఏం చేయాలి" అని భార్యను అడిగాడు తను.

"మాస్టారు బాధలో, ఒంటరితనంతో ఏదో రాస్తారు. అంతమాత్రం చేత బుర్ర పగలకొట్టుకోడం దేనికి ! ఆయనకు నలుగురు కొడుకులున్నారు. అందరూ పెద్ద ఉద్యోగస్తులు, పైగా మంచి జీతగాళ్ళు. ఆస్తిపాస్తులున్నవాళ్ళు. మనకంటే మెరుగైన స్థితిలో వున్నవారు ..........."

భార్య మాటలను కట్ చేసాడు. "ఇప్పుడు మనకు ఏం తక్కువైందని !" అని అడిగాడు.

"జీవితం అంటే అర్థరాత్రి మెలకువ వచ్చినప్పుడు టీ.వి. ఆన్‌చేసి పాత సినిమా పాటలు వినడమో - బోర్ కొడితే గుంపు పాటలు వినడమో కాదు. ఈ ప్రేమలు, అభిమానాలు, ఆప్యాయతలు, అనుబంధాలు కాలక్షేపానికి... నాయకుల ఉపన్యాసాలు, సందేశాల వంటివి. ఇది బూటకం అని అందరికీ తెలుసు. కేవలం "షో" కోసం పలికే బఠానీ కబుర్లు ............ "ఊట కబుర్లు" అందామె. చక్రవర్తి ఆలోచనలో పడ్డాడు.

"చదువు చెప్పి నిన్ను నాకు కట్టబెట్టిన మహానుభావుడు ........ అలాగని ..........."

చక్రవర్తి ధోరణిని ఆపేసింది తను "అంత మాత్రం చేత వూసుకొని తిరగాలా? రేపు ఆయన కొడుకులు విరోధులవుతారు మనకు. ఇప్పటికే మనమంటే అపనమ్మకం. ఎందుకొచ్చిన గొడవ! వాళ్ళు చూసుకుంటారు లెండి. భూషణంకి ఫోను చేసి చెప్పండి - చాలు" అంది నిశ్చయంగా.

భార్యమాటలు చక్రవర్తికి రుచించలేదు.

"ఓసారి చూసి రావాలనుంది" అన్నాడు అతను.

"ఈ దేశాన్ని ఎవరూ మార్చలేనట్లే, మిమ్మల్ని కూడా ఆ భగవంతుడు మార్చలేడు. అనుభవంలో కొచ్చినప్పుడు తత్త్వం బోధపడుతుంది" అని తెగేసి చెప్పేసింది భార్యామణి.

**"మా రోజులు కావివి. కాలం మారిపోయింది. విద్యార్థులు వారి తల్లిదండ్రులు ప్రస్తుతం చదువు పట్ల శ్రద్ధ, ఆసక్తి అంతగా కనబరచట్లేదు. హాయిగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరితే జీతంతో పాటు మనశాంతి లభిస్తాయి. ఆపైన సెలవులు...... ఇతర సౌకర్యాలు ..........".**

మర్నాడు చక్రవర్తి యింటికి వచ్చాడు భూషణం. అతన్ని చూడగానే క్షణంపాటు ఆశ్చర్య పోయాడు. పొట్టి నిక్కరు, లాంగ్ టీషర్టు, చేతిలో చిన్నకర్ర, మీసాలు తీసేసిన ముఖం, నెత్తిమీద టోపీ.

"ఏవిటలా చూస్తున్నావు ........ గుర్తు పట్టలేదా" అని ప్రశ్నించాడు భూషణం.

"ఏవిటా వేషం .......... అమెరికా వెళ్ళొచ్చావా లేక వెళ్ళేందుకు యిది బిల్డప్పా" అన్నాడు చక్రవర్తి నవ్వుతూ.

"ఇది అమెరికా వేషం అని నీకెలా తెలుసు" చటుక్కున అడిగాడు భూషణం.

"ఈ కాలనీలో ముప్పయ్‌మందికి యిదే వేషం. తెలుగు మాట్లాడటం మానేసి అమెరికన్ భాషతో వాయించటం నేర్చుకున్నారు. అక్కడికి తాము అమెరికాలో పుట్టి, యిక్కడ జీవితం వెలగబెడుతున్న చందంగా ...... చూసినా చూడనట్టు నటించడం, పలకరిస్తే వట్టినట్టు తప్పించుకోడం ......" చెబుతున్నాడు చక్రవర్తి.

"మా నాన్న నుంచి ఉత్తరాలొస్తున్నాయా ..... నేను ఎన్నిసార్లు రాసినా నో రిప్లయ్. ఫోను చేసినా దొరకడు అందుకని అడిగాను. నువ్వు ఆయనకు ముఖ్యుడివి కదా" అన్నాడు వెటకారంగా.

" నేను ఆలోచించేది
నా భార్య గురించేరా!
నాకేదయినా అయితే దాని
జీవితం ఎలాగ? కొడుకులు
రమ్మనరు. కూతుళ్ళ దగ్గరికి
వెళ్ళలేదు. దాని మంచీ
చెడు ఎలాగ .........
అదే నన్ను తరచు బాధిస్తోంది"
అన్నారు చెమరింపు
దాచుకుంటూ.

"నేనెలా అవుతాను ! నువ్వు కొడుకువి ... పైగా రెండో వాడివి. అందులో పెద్ద ఉద్యోగివి. ముగ్గురు కొడుకుల తండ్రివి. ఇద్దరు కొడుకుల్ని అమెరికా పంపించిన ఘనుడివి. నగరంలో రెండుఫ్లాట్లు, ఓ ఇండిపెండెంట్ యిల్లు, కారు, స్కూటరులకు యజమానివి ........" చక్రవర్తి మాటలకు అడ్డుపడ్డాడు భూషణం.

"నేను త్రివేండ్రం వెడుతున్నాను. రెండు నెలలు మా అమ్మాయి దగ్గరుండి వస్తాము. నాకో సాయం చేయాలి" అన్నాడు భూషణం.

"ఏవిటి" అడిగాడు చక్రవర్తి.

"ఈ విషయం ఎవరికీ చెప్పద్దు. నిజానికి మా అమ్మ, నాన్నలను చూసేందుకే వెళ్ళాలనుకొన్నాను. మా మధ్య ఎన్నో గొడవలున్నా, ఆయన తండ్రి, నేను కొడుకుని కదా. రావద్దంటారు. రాకపోతే మాటలంటారు. నిజానికి మా వాళ్ళకు మేము యిష్టం వుండదు" అన్నాడు నిశ్చయంగా.

"భలే వెర్రిబాగులవాడిని చేసావు అల్లుడిని. అతను నీ యింటికి రానీకుండా వాళ్ళు సెటిలయి పోతున్నారు. తెలివితేటలంటే నీవి" అన్నాడు చక్రవర్తి నవ్వుతూ.

కొద్దిగా కలవరపడ్డాడు భూషణం.

చక్రవర్తి ఆలోచనలో పడ్డాడు. "ఇంతకీ నేను ఏం చేయాలంటావు" అని అడిగాడు.

"కారు నీ యింట్లో పెట్టుకో. ఇంటి అద్దెలు బ్యాంకులో జమ చేసిపెట్టు"

"ఇంట్లో వారికి చెప్పు ....... కారు అక్కడే పెట్టు ఏమౌతుంది"?!

"కారు వాడకపోతే పాడవుతుంది"

"కిరాయికి నడపమని ఎవరికైనా యిస్తే ఉభయ తారకంగా ఉంటుంది. నీకు ఆదాయం ఉంటుంది. కారూ పాడవదు" సలహా యిచ్చాడు చక్రవర్తి.

షాక్ తిననట్లు జాగ్రత్తపడ్డాడు అతను. "ఇంతకీ ఏంచేయమంటావు" అన్నాడు వెంటనే.

"నీ యిష్ట ప్రకారమే కానీయ్" అన్నాడు చక్రవర్తి.

"కొంపతీసి యీ విషయం ఎక్కడా చెప్పకేం" అంటూ వెళ్ళిపోయాడు.

రాత్రి ఏడుగంటల వేళ ఎవరిద్వారానో కారు పంపించాడు. ఇంటి తాళాలు, బ్యాంకు అకౌంటు నెంబరు యిచ్చాడు భూషణం.

0-0-0

రెండు రోజుల తరువాత చక్రవర్తి రామకోటయ్యను చూసేందుకు వెళ్ళాడు. బస్సు దిగి మాస్టారి ఇల్లు చేరేందుకు నడవసాగాడు. ఎక్కడో మైకులోనుంచి ఘంటసాల పాట వినబడుతోంది.

నిన్ను నిన్నుగా ప్రేమించుటకు నీ కోసమే కన్నీరు నింపుటకు నేనున్నానని నిండుగ పలికే తోడొకరుండిన అదే భాగ్యము అదే స్వర్గము .........

నిజమే మరి! అది వేదాంతం కాదు, వాస్తవమేమో! అరగంట నడక తరువాత రామకోటయ్యను అరుగుమీద చూసాడు చక్రవర్తి. రెండు దినపత్రికలు, ఓ వార పత్రిక ........ చాలదన్నట్లుగా చిన్న టేపురికార్డరు ........ గుమ్మానికి జారగిలపడి పాట వింటున్న మాస్టారి భార్య వాళ్ళిద్దర్ని అలా చూడగానే ఏదో చెప్పలేని అనుభూతి ........ ఆనందం....

ఆశలు తీరని ఆవేశంలో ఆశయాలలో ఆవేదనలో నీ వ్యధ తెలిసి నీడగ నిలిచే తోడొకరుండిన అదే భాగ్యము ........ అదే స్వర్గము.

ఎంత గొప్ప పాట అది ! ఎంతటి అర్థం ! మరెంతటి సాహిత్యం ! ఎంతమందికి బోధపడుతుంది అందులోని వేదన ....... ఆవేదన !

ముద్ద మంచుతో కడిగినట్లుగా కనిపించారు రామకోటయ్య మాస్టారు. అనీజీగా కదులుతున్నారు....

"పెద్దాడు వచ్చాడు" అంది ఆయన భార్య.

వారి భాషకు తెలిసిన 'పెద్దాడు' అంటే చక్రవర్తి అని. తేరిపారి చూసాడాయన తన శిష్యుణ్ణి! కళ్ళల్లో

ఆనందం .......... గుండెలో అనుభూతి ......... పెదవులపై చిరునవ్వు వెరసి ప్రేమతో పలకరింపు "వచ్చావురా" అంటూ.

మాస్టారి చేతివేళ్ళు చక్రవర్తి వీపుపై కొరడాతో ఝుళిపిస్తున్నట్టుగా ఉంది !

తాను తెచ్చిన ఆపిల్సు మాష్టారి చేతిలో పెట్టాడు చక్రవర్తి. "ఎందుకురా యిది ! నువ్వు వచ్చావు. అదే గొప్ప పెట్టుపోత ! ఇంతకీ మీ ఆవిడ, పిల్లలు అంతా బాగున్నారా" అని అడిగాడాయన.

"మీ దయవల్ల మాస్టారు" అన్నాడు తను.

"నా దయ ఏవిటి ......... భగవంతుడి దయ"

"భగవంతుడి ప్రతినిధి మీరు" అన్నాడతను.

"మా వాళ్ళు ఎలా ఉన్నారు? మీ ఇంటికి వస్తుంటారా" కన్నపేగు అడిగించింది.

"వాళ్ళు రారు ...... ఫోను చేసినా దొరకరు .... కాని" అని ఆగిపోయాడు చక్రవర్తి.

"ఏవిటి"

'తొందర పడ్డానేమో' అనుకొన్నాడు చక్రవర్తి.

కాని భూషణం వచ్చివెళ్ళిన విషయాన్ని చెప్పాడు తను. అయితే రామకోటయ్య నమ్మినట్లుగా లేదు. ఎందుకంటే భూషణం గురించి ప్రత్యేకంగా తనకు తెలుసు కాబట్టి.

ఎదురుగా కనిపిస్తోంది మాస్టారి జాగా ! చక్రవర్తి అడిగాడు "ఆ స్థలం ఏం చేయబోతారు" అని .......... "ఇప్పుడు ఆ స్థలం నన్ను బాధిస్తోంది. అది అమ్మేయాలని నా కొడుకుల ఒత్తిడి పెరిగింది. అమ్మితే నాలుగు లక్షలు వస్తుంది. ఒక్కొక్కరికి తలో లక్షవస్తుందని కొడుకుల ఆలోచన" అన్నాడాయన చెమరింపు కంటిని దాచుకుంటూ.

"మాకు ముగ్గురు కూతుళ్ళున్నారుగా. వారికీ యివ్వాలి కదా ....... రేపు మా కోసం కడుపు నిండుగా, తృప్తిగా ఏడ్చేది వాళ్ళేకదా .......... కొడుకులవి గ్లిసరిన్ ఏడుపులు కదా ........." అందామె.

చక్రవర్తికి స్వగతంలోనే నవ్వొచ్చింది. మాస్టారి నిక్కచ్చి అభిప్రాయాలు ......... వాస్తవాలు వింటూంటే.

"నేను ఆలోచించేది నా భార్య గురించేరా ! నాకేదయినా అయితే దాని జీవితం ఎలాగ ? కొడుకులు రమ్మనరు. కూతుళ్ళ దగ్గరికి వెళ్ళలేదు. దాని మంచీ చెడు ఎలాగ ........ అదే నన్ను తరచు బాధిస్తోంది" అన్నారు చెమరింపు దాచుకుంటూ.

"మాస్టారూ ........ నన్ను వదిలేస్తున్నారా" అన్నాడు చటుక్కున.

"ఇప్పుడు వృద్ధాశ్రమాలు వెలుస్తున్నాయి కదా! మేము పనికిరాని, అక్కర్లేని వాళ్ళం కదా ! మా ఉనికి పిల్లలకు యిబ్బంది, అడ్డుకదా ........ పైగా వారి స్వేచ్ఛకు భంగం ........ అందుకని ......... " అంటున్నాడాయన.

రామకోటయ్యలో ఆందోళన పెరుగుతోంది. ఆయన చక్రవర్తిని దగ్గరకు పిలిచాడు. చెవిలో ఏదో చెపుతున్నాడు .......

రెండు నిముషాల తరువాత మాస్టారు నేలమీద ఒరిగిపోయారు.

చక్రవర్తి క్షణాల్లో ఫోన్లు చేసేసాడు అందరికీ. కొడుకులకు ఫోన్లు అందలేదు.

కూతుళ్ళు వచ్చారు మర్నాటికి.

రామకోటయ్య కోరినట్లుగా చక్రవర్తి అన్నీ తానై "పెద్దాడు", "పెద్ద కొడుకు" బాధ్యతను నిర్వర్తించాడు.

తిరిగిరాని లోకాల్లో విహరిస్తున్న రామకోటయ్యకి తృప్తిగా వుంది.

దూరంగా పాట వినిపిస్తోంది ఘంటసాల గొంతులో

**చెలిమియె కరువై వలపే అరుదై**
**చెదిరిన హృదయమే శిలయైపోగా**
**చీకటి ముసిరిన ఏకాంతములో**
**తోడొకరుండిన అదే భాగ్యము**
**అదే స్వర్గము**

చక్రవర్తికి మాస్టారి భార్య తోడైయింది.

చక్రవర్తి భార్య మాస్టారి భార్యకు పెద్ద కోడలు హోదాలోకొచ్చింది.

---

**రంజని నిర్వహించిన రాయప్రోలు రామకృష్ణయ్య స్మారక ఉగాది కథల పోటీలలో ద్వితీయ బహుమతి పొందిన కథ.**